క్లుప్తంగా

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



వైఎస్ జగన్‌తో మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ఢిల్లీలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మడకశిర మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి కలిశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచక పాలనకు వ్యతిరేకంగా బుధవారం ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ధర్నా జరిగిన విషయం తెలిసిందే. ఈధర్నాలో పాల్గొనడానికి ఢిల్లీ వెళ్లిన మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి మర్యాదపూర్వకంగా వైఎస్ జగన్‌ను కలిశారు. మడకశిర నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను మాజీ ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

పరిగి: మొక్కజొన్న పంట సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులను పాటించాలని ఏఓ విజయభారతి సూచించారు. మండలంలోని బోరెడ్డిపల్లిలో గురువారం మొక్కజొన్న పంటను ఆశించే కత్తెర పురుగుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అనంతరం కత్తెర పురుగు ఆశించే మొక్కజొన్న సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న సాగు చేసిన రైతులు పంటను ఆశించిన కత్తెర పురుగు నివారణ కోసం తగిన మందులు వ్యవసాయ అధికారుల సూచనలతో పిచి కారీ చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు లలిత, పావని, వీహెచ్ఏ శివ, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గోరంట్ల: స్థానిక గిరిజన బాలికల సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు గురువారం వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత కలిగిన విద్యార్థులకు హిమోగ్లోబిన్ తదితర పరీక్షలు చేశారు. విద్యార్థులకు ఐరన్ మాత్రలను అందజేశారు. అనంతరం కాలానుగుణంగా వచ్చే వ్యాధులతో పాటు సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, సిబ్బంది భాగ్యలక్ష్మి, సువర్ణదేవి తదితరులు పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన

అగళి: మధూడి, ఇనగలూరు , తోనసనపల్లి, దొక్కలపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఏఓ శేఖర్‌నాయక్ గురువారం సందర్శించారు. రైతు రసాయన మందులు వాడి పెట్టుబడి ఖర్చు పెంచుకోకుండా, సేంద్రియ పద్ధతిలో అతితక్కువ ఖర్చుతో పంటలు సాగు చేసుకోవచ్చని ఏఓ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలధి



జలధికి వెళ్తున్న పీర్లు

లేపాక్షి: మండలంలోని సోమిరెడ్డిపల్లిలో గురువారం పీర్ల జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం పీర్లను గుండం చుట్టూ ఊరేగించారు. భక్తులు పీర్లపై బెల్లం, చెక్కర, బొరుగులను చెల్లి భక్తిని చాటుకున్నారు. అనంతరం గుండంను మూసి వేసి అక్కడి నుంచి పీర్లను జలధి కోసం చెరువులోకి తీసుకెళ్లారు.

ఫుట్‌బాల్ పోటీల్లో హిందూపురం జట్టు ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న జట్టు

హిందూపురం టౌన్: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా బాలికల ఫుట్‌బాల్ జట్టు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో 23, 24, 25వ తేదీల్లో జరిగిన ఫుట్‌బాల్ సబ్ జూనియర్ పోటీల్లో కర్నూలు జట్టుపై శ్రీ సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించిందని చెప్పారు. అనంతరం తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి బీకే మహమ్మద్ సలీమ్, కోచ్ అయిషా, మేనేజర్ మౌనికను అభినందించారు.

దానిమ్మ సాగు..లాభాలు బాగు


- దిగుబడి వస్తుండడంతో సాగుపై రైతుల మొగ్గు
- నియోజకవర్గంలో బోరుబావుల కింద అధికంగా సాగు
- వర్షాధార పంటలతో నష్టపోతున్న రైతులు



విరగ్గాసిన దానిమ్మ

అమరాపురం: రైతులు వర్షాధారం కింద వేరుశనగ సాగు చేసి, పెట్టుబడి కూడా ఖర్చులు రాక, ఏటేటా నష్టాలు చవిచూస్తున్నారు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి, అధిక దిగుబడులతోపాటు లాభాలు ఆర్జిస్తున్నారు. నియోజకవర్గంలో బోరు బావులు ఉన్న రైతులు దానిమ్మ పంటను సాగువైపు మొగ్గుచూపారు. దిగుబడి, ధర ఆశించిన స్థాయిలో ఉండడంతో రైతులు రెండింతల ఆదాయం ఆర్జిస్తున్నారు. నియోజకవర్గంలోని అమరాపురం, అగళి, గుడిబండ రొళ్ల మడకశిర ప్రాంతంలోని రైతులు 1,792 ఎకరాల్లో దానిమ్మ పంటను సాగు చేశారు. ఏడాది కాలానికి పంట చేతికొస్తుంది.ఒక ఎకరా పంట సాగు చేయడానికి రూ.లక్ష వరకు మొదటి సారి ఖర్చు వస్తుందని రైతులు తెలిపారు. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు రూ.5 లక్షల వరకు ఆదాయాన్ని గడిస్తున్నారు. ఖర్చులు పోనూ రూ.4 లక్షల వరకూ ఆదాయం వస్తుంది. దీంతో రైతులకు ఇది సిరుల పంటే. మిగతా ఏ పంట సాగు చేసినా ఇంత ఆదాయం రాదని రైతులు నటరాజు, ఈరన్న, అశోక్ ఈరలింగప్ప, నంజుండప్ప తదితరులు తెలిపారు.





అమరాపురం మండలంలో సాగు చేసిన దానిమ్మ తోట

మార్కెట్‌లో కిలో రూ.120..

ప్రస్తుతం మార్కెట్లో కిలో దానిమ్మ ధర రూ.100 నుంచి రూ.120 వరకు పలుకుతోంది. దీంతో మంచి ఆదాయం వస్తుందని రైతులు తెలిపారు. ఒక ఎకరాకు 40 నుంచి 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని, ప్రస్తుత ధరలతో పోలిస్తే రూ.లక్షలు ఆదాయం వస్తుందని రైతులు చెప్తున్నారు. ఎరువులు మందులు సక్రమంగా వేసి పంటను కంటికిరెప్పలా చూసుకుంటే మంచి దిగుబడి వస్తుందన్నారు. రైతుల వద్దకే వచ్చి పంటను కోనుగోలు చేయడంతో రవాణా ఖర్చులు మిగులుతాయని రైతులు తెలిపారు.

ప్రత్యామ్నాయ పంటతో ఆదాయం



దానిమ్మ పంట సాగు చేయడంతో గత రెండేళ్ల నుంచి ఆదాయం పొందుతున్నా. గతంలో వేరుశెనగ పంట సాగు చేసి నష్టపోయా, పంటను బాగ కాపాడుకుంటే అధిక దిగుబడి పొందుతున్నా. నాకున్న ఐదెకరాల్లో 3 ఎకరాల్లో రెండు ఎకరాల్లో దానిమ్మ సాగు చేశా. ఈ ఏడాది పంట బాగా రావడంతో రూ.8 లక్షలు వచ్చింది. ఇందులో ఖర్చులు పోను రూ.6 లక్షలు ఆదాయం వచ్చింది. చాలా సంతోషంగా వుంది.

– దొడ్డయ్య, రైతు, తమ్మడేపల్లి, అమరాపురం మండలం.

కంటికి రెప్పలా కాపాడుతా



నాకున్న 5 ఎకరాల్లో బోరుబావి కింద 3 ఎకరాల్లో దానిమ్మ సాగు చేశా. పొరుగున ఉన్న కర్ణాటక తమ బంధువులు సాగు చేయడంతో తాను సాగు చేశా కూలీ. ఖర్చులు, మందులు, ఎరువులు తదితర వాటికి రూ.3 లక్షలు ఖర్చు చేశా. ధరలు మే నెలలో ఎండలు వుండడంతో తెగుళ్లు కనబడలేదు. దీంతో మంచి దిగుబడి వచ్చింది. రూ.10 లక్షలకు తోట అమ్మా. దీంతో రూ.7 లక్షలు ఆదాయం వచ్చింది. ఇద్దరు కుమారులను బాగా చదివిస్తున్నా. ఏ పంట సాగులో ఇంత ఆదాయం రాలేదు.

– మల్లికార్జున, రైతు

రికార్డు గదిపై నిఘా ఉంచండి

లేపాక్షి: రెవెన్యూ కార్యాలయంలో ఉన్న రికార్డు గదిపై ప్రత్యేక నిఘా ఉంచాలని పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వభరత్ పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించి భద్రతాపరమైన ఏర్పాట్లపై ఆరా తీశారు. రికార్డు గది వెనుక భాగంలో ఉన్న కిటికీలు, వెంటిలేటర్‌ను మూసి వేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డు గది బయట, లోపల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. పాతఫైల్‌ను భద్రపరిచి వాటిని పరిరక్షించాలని సూచించారు. కార్యాలయంలో ఉన్న 22(ఎ) భూములకు సంబంధించిన రికార్డులను కంప్యూటరైజేషన్ చేయాలని తెలిపారు. రాత్రిపూట కార్యాలయంలో సిబ్బందికి డ్యూటీ వేసి రికార్డులను పరిరక్షించాలన్నారు. అనంతరం అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ బాలనరసింహులు, డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డి ఉన్నారు.



కార్యాలయం వెనుక పరిసరాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వభరత్

చిలమత్తూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించారు. కార్యాలయంలో సీసీ టీవీలను ఏర్పాటు చేసుకోవాలని తహసీల్దార్ భాగ్యలతను ఆదేశించారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డు రూం కాలిపోయిన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

ఏపీఎం తీరుపై ప్రజాప్రతినిధుల మండిపాటు

లేపాక్షి: వైకేపీ ఏపీఎం తీరుపై ప్రజాప్రతినిధుల మండిపడ్డారు. గురువారం ఉదయం స్థానిక వైకేపీ కార్యాలయంలో వైస్ ఎంపీపీ అంజినరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. వైకేపీ ఏపీఎం జయచంద్ర డ్వాక్రా సంఘాల పనితీరును వివరిస్తుండగా వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు అశ్వత్తనారాయణ, నాగేంద్ర, మంజునాథ్, ఎంపీటీసీ సభ్యులు ఆదినారాయణ, అశ్వత్తప్ప అడ్డుకున్నారు. అధికారం శాశ్వతం కాదు..అధికార పార్టీ నాయకుల ఆదేశాలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించి ఆదివారం ఆనిమేటర్లను ఉద్యోగం నుంచి తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. ఎలాంటి సమాచారం లేకుండా ఎలా తొలగిస్తారని నిలదీశారు. మహిళా సంఘాల నిధుల దుర్వినియోగంపై కనీస విచారణ జరగలేదని గుర్తు చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల మార్పుపై ఎంఈఓను ప్రశ్నించగా వారు స్వచ్ఛందంగా తప్పుకున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ వాసుదేవగుప్త మాట్లాడుతూ ఆధార్ కేంద్రాల్లో ప్రజలు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేలా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. అయితే చాలా మంది అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, సీడీపీఓ రెడ్డి రమణమ్మ, తహసీల్దార్ బాలనరసింహులు, ఏఈలు వెంకటేశలు, హనుమేనాయక్, దివ్య, మెడికల్ ఆఫీసర్ వెంకటచిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వాసుదేవగుప్త

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

గోరంట్ల: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి ఆఖరు వరకూ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణములో అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీల పరిధిలో రూ.9,16,93,824 నిధులతో 1,916 పనులను చేపట్టినట్లు ఉపాధి హామీ సిబ్బంది వివరించారు. అందులో రూ.46,397 అవనీతి జరిగినట్లు నిర్ధారించి సంబంధిత సిబ్బందితో రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జయేంద్రప్రసాద్ , ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఉపాధి హామీ విజిలెన్స్ అధికారులు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు పాల్గొన్నారు.



ప్రజా వేదిక నిర్వహిస్తున్న అధికారులు

కుప్పకూలిన టెంటు.. తప్పిన ప్రమాదం

ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక కోసం ఏర్పాటు చేసిన షామియానా టెంటు ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో టెంటు కింద భాగంలో ఉన్న అధికారులు అవాక్కయ్యారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో అధికారులు ఊపిరి పిల్చుకొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పరిగి: విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పరిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్వరూపరెడ్డి సూచించారు. గురువారం మండలంలోని కొడిగెనహళ్లిలో ఉన్న ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో మధ్యాహ్న సమయంలో వంట గదిని, భోజన నాణ్యతను ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబుతో కలసి ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా స్టోర్ రూమ్‌లో నిల్వ చేసిన కూరగాయలు, ఆకుకూరలను పరిశీలించారు. అనంతరం పాఠశాలలో పరిసరాలను సందర్శించి, వంట గదితో పాటూ డార్మెటరీ, శుద్ధ జల ప్లాంటును పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన వసతిని కల్పించడంతో పాటూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. దీంతో పాటూ భోజన విషయంలో రాజీ పడకుండా ఆరోగ్యకరమైన పోషకాలతో కూడిన పదార్థాలను వడ్డించాలని సూచించారు. అనంతరం సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వన్నప్ప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న డాక్టర్ స్వరూప రెడ్డి, ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

సంక్షిప్త సమాచారం

కాలం చెల్లిన మద్యం ధ్వంసం

రొళ్ల: ఎక్సైజ్‌శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో గురువారం సాయంత్రం కల్లు దుకాణాలతో పాటు ప్రభుత్వ మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. మడకశిర రోడ్డు పక్కనున్న (జీఆర్ఓ) ప్రభుత్వ మద్యం దుకాణంలో 276 బీర్ బాటిళ్లు, అగళి మండల కేంద్రం (జీఆర్ఓ) ప్రభుత్వ మద్యం దుకాణంలో 118 బీర్ బాటిళ్లను ధ్వంసం చేశారు. మొత్తం రూ.86,680 విలువజేసే బీరు బాటిళ్లను ధ్వంసం చేసి, కాలువలోకి పారబోశారు.

విద్యార్థినులకు ఉపకార వేతనాల అందజేత

హిందూపురం అర్బన్: పట్టణంలో పాలిటెక్నికల్ డిప్లొమా చదువుతున్న 60 మంది విద్యార్థినులకు గురువారం విప్రో కంపెనీ హెచ్ఆర్ హెడ్ రామకృష్ణ ఉపకార వేతనాలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన తూమకుంట, సంతేబిదనూరులలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అలాగే విప్రో ఫౌండేషన్, విప్రో యూనివర్సిటీ గురించి వివరించారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా ఆడపిల్లల చదువు, వారి ఆర్థికాభివృద్ధి కోసం ఏటా 15 వేల మందికి ఉపకార వేతనాలు అందిస్తున్నారన్నారు. అనంతరం వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్స్ సహకారంతో నిర్వహిస్తున్న కుశాల్ హెల్త్ క్లినిక్ సిబ్బంది విజయ్‌కుమార్, శిరిష, రమాదేవి, మౌనిక కుశాల్ క్లినిక్ అందిస్తున్న సేవలను వివరించారు.

క్షయవ్యాధి నివారణకు టీకా వేయించుకోవాలి

గుడిబండ: క్షయవ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరూ బీసీజీ టీకాను తప్పని సరిగా వేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ సౌందర్య పేర్కొన్నారు. గురువారం మండల వ్యాప్తంగా కరికెర, మందలపల్లి గ్రామ సచివాలయ పరిధిలో ఆరోగ్య సిబ్బంది వృద్ధులకు చేపట్టిన టీకాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 5,915 మంది వ్యాక్సిన్ వేయించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం భ్రమరాంబ, జ్యోతి, పద్మావతి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అమరాపురం: ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ భాస్కర్ అధికారులను సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సర్వేయర్లతో మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ మురుగు కాలువలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సర్వేయర్లు ఆయా గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి, సర్వే నిర్వహించాలన్నారు. కార్యదర్శులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రొళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనాథ్ తెలిపారు. గురువారం ఆర్.వడ్రహట్టి గ్రామాల్లో పారిశుధ్య కార్మికులతో అపరిశుభ్రతను తొలగింపజేశారు. గ్రామాల్లోని రక్షిత మంచినీటి కొళాయిలు, ట్యాంకులు, డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారంతోపాటు మురుగునీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ఆగి ఉన్న లారీ ఢీకొన్న స్కూటీ

మడకశిరరూరల్: బుళ్లసముద్రం గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని గురువారం రాత్రి స్కూటీ ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. హిందూపురం నుంచి మడకశిర వైపు వస్తున్న లారీ బుళ్లసముద్రం వద్ద నిలిపి ఉన్నారు. అదే సమయంలో ఓ యువకుడు మడకశిర వైపు నుంచి స్కూటీలో వెళ్లి లారీ ఢీకొట్టాడు. 108 వాహనంలో గాయపడిన యువకుడిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన యువకుడు హిందూపురానికి చెందిన వాడని సమాచారం.

ఇష్టపడి చదివితేనే ఉన్నత స్థాయి

అమరాపురం: పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎస్ఐ జనార్దననాయుడు తెలిపారు. గురువారం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ర్యాగింగ్ చేయడం, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు చేయడం, డ్రగ్స్‌ను ఉపయోగించడం వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత నియమాలు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు, బాల్య వివాహాల వల్ల అనర్థాలను తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఓబళపతి, ఏఎస్ఐ రామంజనేయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా అందించండి

రొళ్ల: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా అందించాలని గుడిబండ పీహెచ్‌పీ డాక్టర్ సౌందర్య పేర్కొన్నారు. గురువారం అలుపనపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించారు. తర్వాత మధ్యాహ్న భోజనం అమలు తీరుపై పర్యవేక్షించారు. డాక్టర్ సౌందర్య మాట్లాడుతూ మెనూ ప్రకారం ఎండీఎం నిర్వాహకులు పిల్లలకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలన్నారు.

మహిళలకు అండ అనంతశక్తి సొసైటీ

రొద్దం: మహిళలు ఆర్థికాభివృద్ధికి అనంతశక్తి సొసైటీ కొండంత అండగా నిలుస్తోందని టింబక్టు-కలెక్టివ్ అధినేతలు మేరీ వటవట్టం, బబ్లూగంగూళి అన్నారు. టింబక్టువ్-కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఏర్పడిన అనంతశక్తి సొసైటీ అంచలంచెలుగా ఎదుగుతోందన్నారు. గురువారం అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య అధ్యక్షతన జరిగిన 25వ వార్షికోత్సవ మహాసభలో మేరీ, సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో చైతన్యం పొందాలన్నారు. ఈ సందర్భంగా 2024-25 ఆర్థిక సంవత్సరం లెక్కలు, ఆడిట్ నివేదిక చదివి వినిపించారు. ఆటపాటలు, చెక్కభజన, సిబ్బంది నృత్యాలు, కట్టెల కోలాటం, నాటికలు అలరించాయి. అనంతరం పలువురు సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో మేనేజర్లు సుకన్య, రమేష్, మహాశక్తి సీఈఓ రమిజా, సొసైటీ పాలకవర్గం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధి మేరీవటవట్టం

సామాజిక సమస్యలపై సాహిత్యంతో చైతన్యం

హిందూపురం: సామాజిక సమస్యలపై సాహిత్యం ద్వారా చైతన్యం కల్పించనున్నట్లు తపన సాహిత్య వేదిక అధ్యక్షుడు సడ్లపల్లె చిదంబరెడ్డి, వేదిక సభ్యులు యాములపల్లి నరసిరెడ్డి, సిద్దగిరి శ్రీనివాస్,లంకమల వివేక్ తెలిపారు. గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈప్రాంతంలోని సామాజిక సమస్యలు, ఇక్కడి ప్రజల వ్యవహారిక భాషకు సాహిత్య రంగంలో చోటు కల్పించి సభ్య సమాజానికి జాగృతం చేసే దిశగా వేదిక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సామాజిక సమస్యలపై రచనలు చేసేవారిని ప్రోత్సహిస్తూ రూ.5 వేల పురస్కారాన్ని అందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయురాలికి సన్మానం

పెనుకొండ: పట్టణానికి చెందిన శాంతినికేతన్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల హెచ్ఎం జే.అరుణను ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. బోధనలో మంచి ప్రతిభను కనబరుస్తూ విశిష్ట సేవలు అందించిన నేపథ్యంలో ముంబయికి చెందిన ఇండియన్ టాలెంట్ ఒలంపియాడ్ నిర్వాహకులు ఆమెను ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలిగా ప్రకటించారు. సెప్టెంబర్ 8న ఒలంపియాడ్ నిర్వాహకుల నుంచి ఆమె పురస్కారం అందుకోనుంది. కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నగదు విరాళం

అమరాపురం: మండలంలోని బసవనపల్లిలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి రూ.10 వేలు నగదు రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాజేశ్వరి గురువారం అందజేశారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

పావగడ: తాలూకా వ్యాప్తంగా 2023-24 ఏడాదిలో ద్వితీయ పీయూసీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు స్థానిక తేజస్ చారిటబల్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందించారు. గురువారం పట్టణంలోని హర్షిత కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన పురస్కారాల కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి గాయత్రి బాయి మాట్లాడారు.

కంపచెట్లు తొలగించాలని సబ్ కలెక్టర్ ఆదేశం

మడకశిర: నియోజకవర్గంలోని పలు ఆర్అండ్‌బీ రోడ్లకిరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించాలని స్థానిక ఆర్అండ్‌బీ అధికారులను పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. రోడ్లకిరువైపులా పెరిగిన కంపచెట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనానికి స్పందించిన సబ్ కలెక్టర్ పైఆదేశాలు జారీ చేశారు. అమరాపురం మండలంలోని బసవనపల్లి-ఉప్పార్లపల్లి మధ్య ఆర్అండ్‌బీ రోడ్డుకిరువైపులా పెరిగిన కంపచెట్లను వెంటనే తొలగించాలని ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. నిధులు మంజూరు కాగానే కంపచెట్లను తొలగించి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూస్తామని ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు.

పిల్లలకు ఉచిత ఆధార్ నమోదు

అగళి: అగళి పంచాయతీలోని ఆరు అంగన్‌వాడీ కేంద్రంలో ఉచిత శిశు ఆధార్ నమోదు చేస్తున్నట్లు మీ సేవ నిర్వాహకుడు సిద్దరాజు తెలిపారు. ఈ నెల 27 వరకు ఐదేళ్లలోపు చిన్న పిల్లలకు ఉచిత ఆధార్ నమోదు కార్యక్రమం నిర్వహిసున్న తెలిపారు.

వ్యాక్సినేషన్‌తో వ్యాధుల నివారణ

అగళి: మండలంలోని పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి (ఎల్ ఎస్ డీ) లక్షణాలు కనిపించడంతో వ్యాధి రాకుండా ముందస్తుగా గోట్ ఫాక్స్ టీకా వేస్తున్నట్లు మడకశిర ఏడీ అమర్ తెలిపారు. లంపీ స్కిన్ వ్యాధి క్యాప్రీ ఫ్యాక్స్ అనే వైరస్ నుంచి వస్తుందన్నారు. ఆవులు, ఎద్దులు, లేగదూడల్లో ఈ వ్యాధి సోకుతోందన్నారు.

కళాశాల హాస్టళ్లలో అరకొర సీట్లతో అవస్థలు

మడకశిర: మడకశిర కేంద్రంగా ఉన్న కళాశాల హాస్టళ్లలో సీట్లు పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలురు, బాలికలకు ప్రత్యేకంగా మడకశిరలో రెండు కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. ఈహాస్టళ్లలో మడకశిరలో చదివే వివిధ కళాశాలలకు చెందిన బాలురు, బాలికలు చేరుతారు. అయితే పూర్తి స్థాయిలో సీట్లు కేటాయించలేదని వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులే మడకశిరలోని కళాశాలల్లో ఎక్కువగా చదువుకుంటున్నారు. మడకశిర కేంద్రంగా డిగ్రీ, రెండు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వందలాది మంది విద్యార్థులు ప్రతి ఏడాది ఈకళాశాలల్లో చేరి విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే ఈహాస్టళ్లలో 100 మించి సీట్లు కేటాయించ లేదని విద్యార్థులు వాపోతున్నారు. చాలా మంది పేద విద్యార్థులు హాస్టళ్లలో సీట్లు దొరక్క చదువు మానేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ సీట్లు కేటాయించే విధంగా చూడాలని కోరుతున్నారు.

డ్రైవర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం



కాలు విరిగిన డ్రైవర్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

రొద్దం: మండల కేంద్రంలో వివిధ ప్రమాదాల్లో గాయపడిన డ్రైవర్ల కుటుంబాలకు ఆల్ ఆంధ్ర డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసొసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సాయం అందించారు. కియా సంస్థ హొండై గ్లావిస్ ఎస్‌డీటీ రైడర్స్ కాంట్రాక్ట్ డైవర్లుగా విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తూ గాయపడిన రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి చేయూతనిచ్చారు. కంపెనీ తరపున నాగేంద్ర కుటుంబానికి రూ.50 వేలు, దేవరాజు కుటుంబానికి రూ.20 అందజేసినట్లు డ్రైవర్ల యూనియన్ నాయకుడు మసూద్ తెలిపారు. ఎస్‌డీటీ రైడర్స్ కంపెనీలో పనిచేస్తున్న డ్రైవర్లను అన్ని విధాలా ఆదుకుంటామని ఎండీ గిరిబాబు, సురేష్ హామీ ఇచ్చారు.

ద్వి చక్ర వాహనం చోరీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని వారపుసంతలో గురువారం బైక్‌ను దుండుగులు ఎత్తుకెళ్లినట్లు వాహన యజమాని బెస్త చంద్రశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదుపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సెల్‌ఫోన్‌తో పరారీ

సోమందేపల్లి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చికెన్ షాప్ యజమాని ముబారక్‌కు చెందిన సెల్ ఫోన్‌ను దుండగుడు ఎత్తుకెళ్లిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. షాప్ బయట ఆయన కుమారుడు ఫోన్ చేతిలో పట్టుకుని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పరారయ్యాడు. రూ.32 వేల విలువైన ఫోన్ చోరీకి గురైందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.